

ప్రజా పోరాటాలకు సన్నద్ధమవ్వాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్

ప్రజాశక్తి - ఆదోని

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేస్తూ ప్రజా పోరాటాలకు సన్నద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ పేర్కొన్నారు. సిపిఎం ఆదోని పట్టణం 8వ మహాసభ శనివారం పట్టణంలోని కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య ప్రాంగణంలో నాయకులు తిప్పన్న, మక్బుల్ భాను, కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగింది. ముందుగా సిపిఎం సీనియర్ నాయకులు మహానంద రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఇటీవల మరణించిన సిపిఎం నేతలకు, బుద్ధదేవ్ భట్టాచార్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. అనంతరం డి.గౌస్‌దేశాయ్ మాట్లాడారు. ఆదోని పట్టణంలోని పాత బస్టాండ్ మైదానంలో చాలాకాలంగా పూల వ్యాపారం, పండ్లు విక్రయం చేసుకొని జీవించేవారు దుకాణాల కొరతతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నిర్మాణం చేపట్టిన షాపింగ్ కాంప్లెక్స్‌లో షాప్‌ల కోసం సుమారు రూ. 4 కోట్లు మున్సిపాలిటీకి గుడ్ విల్ కింద వచ్చిందన్నారు. కొత్త ప్రభుత్వం మీద ఆశలు పెట్టుకున్న చిన్న వ్యాపారులకు నిరాశే మిగిలిందన్నారు. ఆదోని పట్టణంలోని పాత బస్టాండ్ మైదానంలో అర్థాంతరంగా ఆగిన మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం వ్యవహారంపై ఎమ్మెల్యే పార్థసారథి ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అభివృద్ధిలో వెనుకబడ్డ ఆదోని కోసం ఎలాంటి నిధులు కేటాయించలేదని, కనీసం ఆ దిశగా ఎమ్మెల్యే కృషి చేయడం లేదని విమర్శించారు. కేంద్రంలో పలుకుబడి ఉందని, నిధులు తెస్తామని పదే పదే చెప్పిన ఎమ్మెల్యే పార్థసారథి ఒక్క పైసా కూడా కేంద్రం నుండి తేలేదని ఎద్దేవా చేశారు. ఆదోని డివిజన్‌లో వేదవతి ప్రాజెక్టు నిర్మాణం, ఆర్డీఎస్ కుడి కాలవ, గుండ్రేవుల, మేళిగనూరు వద్ద తుంగభద్ర వరద కాలువ వంటి వాటికి బడ్జెట్లో పైసా కూడా రాలేదన్నారు. దీన్నిబట్టి చూస్తే ఈ ప్రాంతంపై ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి బట్టబయలైందన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ మాట్లాడుతూ ఆదోనిలో పాత ఫ్లై ఓవర్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుందని కొత్త బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని సిపిఎంగా పోరాటం చేస్తామన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం మొదలైందని, ఎన్నికలు పూర్తి కాగానే అధికారంలోకి వచ్చిన పార్థసారథి సహకరించాల్సింది పోయి ఆటంకం కలిగించారన్న భావన ప్రజల్లో ఉందన్నారు. వెంటనే పనులు ప్రారంభించి లబ్ధిదారులకు మేలు జరిగేలా చూడాలన్నారు. లేని పక్షంలో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. మెడికల్ కాలేజ్ పనులు ప్రారంభించాలని, పట్టణ జనాభాకు అనుగుణంగా అదనంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని, పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు రోడ్ల వెడల్పు కార్యక్రమం చేపట్టి, బైపాస్ రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు పట్టణంలో అవుట్డోర్ ఇండోర్ స్టేడియంలో నిర్మించాలన్నారు. పట్టణం నడిబొడ్డున అసంపూర్తిగా మిగిలి ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ నిర్మాణం పనులు వెంటనే పూర్తి చేయాలని మహాసభలో తీర్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, లక్ష్మన్న గోపాల్, వెంకటేశులు, వీరేష్ ,శ్రీనివాసులు, అజీమ్ ఖాన్, మునెప్ప, నాగేంద్ర, నాగరాజు, ముక్కన్న, వెంకటేష్ పాల్గొన్నారు.



ఆదోని పట్టణ మహాసభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

సిపిఎం ఆదోని పట్టణ కమిటీ ఎన్నిక : సిపిఎం ఆదోని పట్టణ కమిటీ కార్యదర్శిగా లక్ష్మణ్, సెక్రటేరియట్ మెంబర్స్‌గా పిఎస్ గోపాల్, తిప్పన, ముక్కన్నలతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.



పట్టణ కార్యదర్శి లక్ష్మణ్

నిరసనాగ్రహం..!

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక, కర్షక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో కర్నూలులో జిల్లా పరిషత్ ఆవరణం నుంచి రాజ్‌విహార్ కూడలి, బుధవారపేట మీదుగా కలెక్టరేట్ వరకూ నిరసన ప్రదర్శన చేపట్టి కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంఎ గఫూర్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నదని తెలిపారు. రైతుల ఆందోళన సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మోడీ ప్రభుత్వం విఫలమైందన్నారు. నంద్యాల పట్టణంలో సిఐటియు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నూనెపల్లె ఫ్లైఓవర్ బ్రిడ్జి నుండి సాయిబాబా నగర్ బైక్ మీదుగా పద్మావతి నగర్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం జరిగిన సభలో సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.ఏసురత్నం, ఎ.నాగరాజు, రైతుసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి రమేష్ కుమార్, ఏ రాజశేఖర్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మార్కు పాల్గొని మాట్లాడారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నదని విమర్శించారు. ఎన్నో త్యాగాలతో సాధించుకున్న చట్టాలను మార్చేసి కార్మికులను కట్టు బానిసలుగా మార్చే విధానాలు అనుసరిస్తుందని అన్నారు. పెట్టుబడు దారులకు అనుకూలమైన విధానాలు తీసుకొచ్చిందని తెలిపారు. ఈజ్‌ఆఫ్‌డూయింగ్ బిజినెస్ పేరుతో పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తుందని, కార్మికులను ఏమాత్రం పట్టించుకోవడంలేదని విమర్శించారు. 375 రోజులు కొనసాగిన రైతు ఉద్యమం సందర్భంగా నరేంద్ర మోడీ రైతులకు ఇచ్చిన హామీని నెరవేర్చడంలో విఫలమయ్యారని అన్నారు. కార్మికుల పోరాడి సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కోడ్లుగా మార్చి బడా పెట్టుబడి దారులకు అనుకూలమైన చట్టాలను చేశారని అన్నారు. వాటిని రద్దు చేసే వరకు పోరాటాలు చేయాలన్నారు.

చలి పంజా..!

జిల్లాలో మొన్నటి వరకు ఆలస్యం అయ్యిందనుకున్న శీతాకాలం ఎట్టకేలకు వచ్చేసింది. వచ్చీరాగానే శీతల గాలులు వీస్తున్నాయి. సాయంత్రం కూడా కాకముందే వాతావరణం చల్లగా మారిపోతోంది. రాత్రి గడిచేకొద్దీ మరింత చల్లగా మారి జనాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ సమయంలో బయటకు రావాలంటేనే ప్రజలు జంకుతున్నారు. వెచ్చదనం కోసం తపించి పోతున్నారు. జిల్లాలో చలిపులి భయ పెడుతోంది. మొన్నటి వరకు కార్తీకమాసం ప్రారంభమైనా ఇంకా చలి ప్రారంభం కాలేదని అందరూ అనుకున్నారు. ప్రస్తుతం చలితో పాటు శీతల గాలులు వీస్తున్నాయి. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు చలి తీవ్రత ఎక్కువగా ఉంటోంది. కర్నూలు, కోడుమూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, నంద్యాల, ఆత్మకూరు, బనగానపల్లె ఇలా అన్ని చోట్ల శీతల గాలులు వీస్తున్నాయి. చాలా ప్రాంతాల్లో అత్యల్ప ఉష్ణోగ్రతలు 15 డిగ్రీలకు పడిపోయాయి. వ్యవసాయ భూముల్లో (గ్రామీణ ప్రాంతాల్లో) చలి ప్రభావం మరింత ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో చలి కారణంగా ప్రజలు జలుబు, దగ్గు, బారిన పడుతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అదే సమయంలో ఒక రకమైన ఇన్ఫ్లూయెంజా వైరస్ కూడా ఈ సీజన్లో వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు.

అవీ..ఇవీ..అన్నీ..

విద్యుత్ ఒప్పందాల్లో అవినీతిపై చర్యలు తీసుకోవాలని పలు ప్రాంతాల్లో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పూలే విగ్రహానికి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



వైసిపి హయాంలో వ్యవస్థలన్నీ నాశనం

- త్వరలో కర్నూలులో హైకోర్టు బెంచ్ కార్యకలాపాలు : మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

రాష్ట్రంలో గత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యవస్థలన్నింటినీ నాశనం చేశారని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిలు పేర్కొన్నారు. కర్నూల్‌లో త్వరలోనే రాష్ట్ర హైకోర్టు బెంచ్ ప్రారంభించి కార్యకలాపాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలోని కాల్వబుగ్గ దేవాలయ ప్రాంగణంలో టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షుడు, టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్ ఆధ్వర్యంలో కార్తీక మాస వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం మీడియాతో మంత్రులు మాట్లాడుతూ వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కర్నూల్‌లో న్యాయ రాజధాని ఏర్పాటు చేస్తామని ప్రకటించి అమలు చేయలేదన్నారు. తమ ప్రభుత్వం మాత్రం ఇచ్చిన హామీ మేరకు అసెంబ్లీలో హైకోర్టు బెంచ్ తీర్మానం చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలు అనేక అవస్థలు పడ్డారన్నారు. కనీసం రోడ్లను కూడా మరమ్మతులు చేపట్టలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రోడ్ల మరమ్మతుల పనులకు నిధులను విడుదల చేసి పనులను కూడా చేపడుతున్నామన్నారు. సూపర్ సిక్స్ హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పాణ్యం, శ్రీశైలం, నందికొట్కూరు ఎమ్మెల్యేలు గౌరు చరితా రెడ్డి, బుడ్డా రాజశేఖర్ రెడ్డి, గిత్త జయసూర్యలు మాట్లాడుతూ ఓర్వకల్లును ఇండస్ట్రియల్ హబ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీని కూడా విడుదల చేసిందన్నారు. అలాగే త్వరలోనే 300 ఎకరాల్లో డ్రోన్ హబ్ కూడా ఇక్కడే ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం నంద్యాల జిల్లాలో కార్పొరేషన్ చైర్మన్లుగా, డైరెక్టర్లుగా ఎన్నికైన వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు గౌరు వెంకట్ రెడ్డి, మాండ్ర శివానందరెడ్డి, సీడ్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి, టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మండల సీనియర్ నాయకులు సిఎస్ సుధాకర్ రెడ్డి, ఓర్వకల్లు పొదుపు సంఘం గౌరవాధ్యక్షులు విజయభారతి, హుసేనాపురం వాటర్ షెడ్ కమిటీ చైర్మన్ చంద్ర పెద్ద స్వామి, స్థానిక నాయకులు మహబూబ్ బాషా, ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



టిటిడి బోర్డు మెంబర్ మల్లెల రాజశేఖర్‌ను సన్మానిస్తున్న మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దన్ రెడ్డి, ఎమ్మెల్యేలు

మొదటి దశలో క్యాన్సర్ నివారణ సాధ్యం

- స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ద్వారా సర్జరీలు, కీమోథెరపీ సేవలు : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా
- 'ప్రివెంటీవ్ అంకాలజీ-ప్యాలియేటివ్ కేర్' అంశంపై స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ తొలి సదస్సు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

క్యాన్సర్ వ్యాధిని మొదటి దశలోనే గుర్తిస్తే నివారణ సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ద్వారా మెరుగైన వైద్య సేవలు అందిస్తామని తెలిపారు. శనివారం కర్నూలు వైద్య కళాశాలలో 'ప్రివెంటివ్ ఆంకాలజీ–ప్యాలియేటివ్ కేర్' అంశంపై స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ తొలి సదస్సు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ కర్నూలు జిల్లాలో ఏర్పాటు కావడం గర్వకారణమన్నారు. రాష్ట్ర క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ తొలి వార్షిక సదస్సు క్యాన్సర్ నివారణ, చికిత్స విధానాలు, నూతన ఆవిష్కరణలను తెలియజేసే గొప్ప వేదికగా నిలిచిందని అభిప్రాయపడ్డారు. కర్నూలు వైద్య కళాశాల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ద్వారా సర్జరీలు, కీమోథెరపీ వైద్య సేవలను అందించేందుకు సుమారు రూ.30 కోట్ల వ్యయంతో వైద్య పరికరాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ శ్రీకృష్ణ ప్రకాష్ మాట్లాడుతూ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ద్వారా ప్రజలకు మంచి సేవలు అందుతాయన్నారు. కర్నూలు పట్టణంలో ఉన్న ట్రిపుల్ ఐటి డిఎంతో అవగాహన ఒప్పందం కుదిరిందని, వారి సహకారంతో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఉపయోగించి మెరుగైన వైద్య సేవలందించేలా కృషి చేస్తామన్నారు. ట్రిపుల్ ఐటీ రిజిస్ట్రార్ కె.గురుమూర్తి మాట్లాడుతూ క్యాన్సర్ మహమ్మరి ద్వారా తన తల్లిదండ్రులు మరణించారని చెప్పారు. తన సోదరుడు అమెరికాలో క్యాన్సర్ వ్యాధిపై రీసెర్చ్ చేస్తున్నారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంట ఉత్పత్తులను తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా కర్నూలు జిల్లాలో క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌ను పూర్తి వైద్య సదుపాయాలతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్నూలు వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ కలుషిత ఆహారం, నీరు, గాలి వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలున్నాయని, వీటిని నియంత్రించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కెనడా నుండి వచ్చిన టూవరల్డ్ క్యాన్సర్ కోఆర్డినేషన్ డైరెక్టర్ డాక్టర్ సైమన్ సట్‌క్లిఫ్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను మొదటి దశలోనే గుర్తించి నివారించుకోవడం ఉత్తమమని అన్నారు. టూవరల్డ్ క్యాన్సర్ కొలాబరేషన్ ప్రతినిధులు ఇక్కడి విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అంతకుముందు కార్యక్రమానికి హాజరైన అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కెనడా దేశం టూవరల్డ్ క్యాన్సర్ కొలాబరేషన్ ప్రతినిధులు డాక్టర్ గిల్లియన్ ఫైల్స్, డాక్టర్ మేరియాన్ మోర్గాన్, డాక్టర్ గాయత్రి పలాట్, వైద్య సిబ్బంది, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



మాట్లాడుతున్న రాముడు

1, 2న సిపిఎం న్యూ సిటీ నగర మహాసభ

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

సిపిఎం కర్నూలు న్యూ సిటీ నగర 3వ మహాసభ ఈనెల 1, 2న నగరంలోని ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు, కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.సాయిబాబా, ఆర్.నరసింహులు, కె.సుధాకరప్ప తెలిపారు. శనివారం కల్లూరు సూర్యనారాయణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 1న కార్మిక కర్షక భవన్ పక్కన ఉన్న ఎస్ఎస్ ఫంక్షన్ హాలులో ప్రతినిధుల మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. 2న సాయంత్రం కల్లూరు చెన్నమ్మ సర్కిల్లో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత మూడేళ్లలలో నిర్వహించిన పోరాటాలు సమీక్షించి రాబోయే కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు సాధించాల్సిన వాటిని రూపొందించి భవిష్యత్తులో పోరాటాలు చేయడం కోసం మహాసభ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో జరిగే బహిరంగ సభకు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె.ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి.నిర్మల, జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ హాజరవుతున్నట్టు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూల్ నగరంలోని ఎక్యాంపులోని మైపర్ ఫార్మసీ కళాశాలలో వరల్డ్ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా శనివారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కాసర్ల సురేష్ విద్యార్థులకు ఎయిడ్స్ మహమ్మారి యొక్క లక్షణాలు, వ్యాధి వ్యాప్తి గురించి, వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు బహుమతులు అందజేశారు. సందర్భంగా విద్యార్థులు ఏ క్యాంపులోని కళాశాల నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. సమాజం నుంచి ఎయిడ్స్ బారిన పడకుండా ఉండాలని దాని జాగ్రత్తలను నినదిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఆర్ రఘువీర్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కాసర్ల సురేష్

ఆపార్ నమోదు వేగవంతం : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూల్ కలెక్టరేట్

జిల్లాలో పాఠశాల విద్యార్థులకు అపార్ ఐడి ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా విద్యా శాఖాధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ఈనెల 7న మెగా పేరెంట్స్ టీచర్ల మీటింగ్ విద్యార్థుల వికాసానికి, విద్యా ప్రమాణాల మెరుగుదలకు తోడ్పడుతుందన్నారు. ఈ మీటింగ్‌కు స్కూల్‌లోనే ఆహ్వాన పత్రికలను రూపొందించి విద్యార్థుల తల్లిదండ్రులను, ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని తెలిపారు. పూర్వ విద్యార్థులను కూడా ఆహ్వానించాలని ఆదేశించారు. తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు విద్యార్థుల పురోగతి, ఎదుర్కొంటున్న అడ్డంకులు, విద్యార్థి సాధించిన విజయాలపై చర్చించాలని తెలిపారు. తల్లుల కోసం రంగోళి పోటీలు, తండ్రుల కోసం టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించాలని సూచించారు. బ్యానర్లు, పోస్టర్లు, ఫ్లెక్సీలు ఉండకూడదన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులకు బడిలో ఉన్న మధ్యాహ్న భోజనాలు అందించాలని సూచించారు. అవసరమున్న చోట ఆధార్ సెంటర్లను పెంచాలని ఆదేశించారు. ప్రయివేట్ పాఠశాలలు సరిగ్గా స్పందించడం లేదని అధికారులు తెలపడంతో, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను పిలిపించి మాట్లాడాలని సబ్ కలెక్టర్, ఆర్‌డిఓలు, ఎంఇఓలను ఆదేశించారు. తొలుత ఆధార్ సక్రమంగా ఉన్న అపార్ కార్డుల జనరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

వక్ఫ్, దేవదాయ భూములు ఆక్రమణ కాకూడదు

వక్ఫ్, దేవదాయ భూములు ఆక్రమణలకు గురి కాకుండా రక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని రంజిత్ బాషా పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వక్ఫ్ ప్రొటెక్షన్ కమిటీని ఏర్పాటు చేసి తొలి సమావేశాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. మండల స్థాయిలో టాస్క్ ఫోర్స్ టీములు ఏర్పాటు చేసి, అన్ని వక్ఫ్, దేవదాయ భూములను తనిఖీ చేయాలని ఆదేశించారు. వక్ఫ్, దేవదాయ భూములను సర్వే నెంబర్ వారీగా తనిఖీ చేసి, ఆక్రమణలకు సంబంధించి ప్రస్తుతం ఉన్న పరిస్థితి ఏమిటని రికార్డ్ చేసి నివేదికను 10 రోజుల్లోపు తనకు సమర్పించాలని ఆదోని సబ్ కలెక్టర్, కర్నూలు, పత్తికొండ ఆర్‌డిఓలను ఆదేశించారు. 15 రోజులకోసారి జిల్లా కమిటీ సమావేశం నిర్వహించి, ఆక్రమణలపై తీసుకున్న చర్యలపై సమీక్షిస్తామని చెప్పారు. వక్ఫ్, దేవదాయ భూములకు సంబంధించిన సర్వే నెంబర్ల పూర్తి వివరాలను మండల, డివిజన్ వారీగా తయారు చేసి సబ్ కలెక్టర్, ఆర్‌డిఓలకు అందజేయాలని డిఆర్‌ఒను ఆదేశించారు. జెసి డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డిఆర్‌ఒ సి.వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, కర్నూలు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్ర బాబు, మైనార్టీ సంక్షేమ అధికారి సబిహా పర్వీన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాష



విరమణ అధికారులకు సన్మానం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

సుదీర్ఘకాలం పోలీసుశాఖలో పని చేసి పోలీసు సిబ్బంది విరమణ పొందడం అభినందనీయమని ఎస్పీ జి.బిందు మాధవ్ తెలిపారు. విరమణ పొందిన ఎస్ఐ, ఎఆర్ ఎస్ఐలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శాలువా, పూలమాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. కర్నూలు హెడ్ క్వార్టర్ ఎస్ఐ ఆర్.శ్రీనివాసులు, ఆర్మ్‌డు రిజర్వ్‌డ్ ఆర్ఎస్ఐ ఎస్.సమీర్ బాష విరమణ పొందారు. ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, సిఐలు ప్రసాద్, శివశంకర్, ఆర్ఐలు సోమశేఖర్ నాయక్, నారాయణ, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు నాగరాజు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

అప్రమత్తతే ముఖ్యం

- పత్తికొండ డీఎస్పీ వెంకట్రామయ్య

ప్రజాశక్తి - పత్తికొండ

సైబర్ నేరాల పట్ల అప్రమత్తతే ముఖ్యమని డీఎస్పీ వెంకటరామయ్య తెలిపారు. శనివారం ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు పత్తికొండ మండలం జుటూరు గ్రామంలో పోలీసులు గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య పాల్గొని మాట్లాడారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధులలో పోలీసు అధికారులు, సిబ్బంది సైబర్ నేరాల నియంత్రణకు, కట్టడికి సైబర్ నేరాల అవగాహనతో కరపత్రాలను ప్రతి ఇంటికి ఇచ్చి ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఆన్‌లైన్ లావా దేవీలు చేసే క్రమంలో టెక్నాలజీని వాడుతున్నప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎవరైనా సైబర్ క్రైమ్ నేరగాలతో మోసపోతే వెంటనే 1930 కాల్ చేయాలని అన్నారు. వైస్ ఎంపిపి రంగమ్మ, తహశీల్దార్ రమేష్, పత్తికొండ అర్బన్ సిఐ జయన్న, ఆర్ఐ శ్రీనివాసులు, టిడిపి నాయకులు ఈశ్వరప్ప పాల్గొన్నారు.

95 శాతం పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

డిసెంబర్ నెలకు సంబంధించిన ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీని శనివారం జిల్లావ్యాప్తంగా ప్రారంభించారు. కర్నూలు నగరంలో కలెక్టర్ పి.రంజిత్ బాష, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి స్థానిక జోహరాపురంలోని 18వ వార్డులో పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. జిల్లాలో మొత్తం 2,40,330 పింఛన్లకు గాను 2,29,702 పింఛన్లను పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా సచివాలయ ఉద్యోగులు ఇతర సిబ్బంది మొత్తం కలిపి 95 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు డిఆర్‌డిఎ పీడీ నాగ శివ లీల వెల్లడించారు. **కర్నూలు కార్పొరేషన్ :** నగరంలోని స్వామిరెడ్డి నగర్‌లో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు పంపిణీ చేశారు. అనంతరం స్థానికులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు వాసన వస్తోందని, స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పారు. **కర్నూలు క్రైం :** కర్నూలు మండలం వెంకాయపల్లిలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పాల్గొని వృద్ధులకు, వితంతువులకు పెన్షన్ పంపిణీ చేశారు. **తుగ్గలి**లో ఎన్‌టిఆర్ పింఛన్ భరోసా లబ్ధిదారులకు స్థానికులతో కలిసి ఇంటింటికి వెళ్లి అందజేశారు. టిడిపి మండల అధ్యక్షులు తిరుమల నాయుడు, ఎంపిడిఒ విశ్వమోహన్ తెలిపారు. **సిబెళగల్**లో పింఛన్ల పంపిణీని ఎంపిడిఒ రాణెమ్మ పర్యవేక్షించారు. **వెల్దుర్తి** మండలంలో టిడిపి నాయకులు దగ్గర ఉండి పింఛన్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కెఇ.శ్యామ్ బాబు ఆదేశాలమేరకు వెల్దుర్తిలో టిడిపి మండల అధ్యక్షులు బలరాం గౌడ్ పింఛన్లు పంపిణీ చేశారు. గిడ్డయ్య ఆధ్వర్యంలో 15వ వార్డులో పంపిణీ చేశారు. గుంటుపల్లి గ్రామంలో టిడిపి నాయకులు వెంకట్రాముడు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. నర్సాపురం గ్రామంలో మాజీ సర్పంచి రాముడు, రాజేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.



వెల్దుర్తి మండలంలో



పింఛన్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాష



పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి



బెళగల్‌లో...



తుగ్గలిలో..

బస్సు, బైక్ ఢీకొని యువకునికి గాయాలు

ప్రజాశక్తి - తుగ్గలి

మండలంలోని రాతన గ్రామ బస్టాండ్ సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం, బస్సు ఢీకొన్న సంఘటనలో యువకునికి గాయాలయ్యాయి. పత్తికొండ వైపు వెళ్తున్న బస్సు తుగ్గలి వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పగిడిరాయి కొత్తూరు గ్రామానికి చెందిన యువకుడు వంశీకి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం అంబులెన్స్ ద్వారా పత్తికొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

ఘనంగా పద్మనాభ తీర్థుల మధ్యారాధన

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో శ్రీపద్మనాభ తీర్థుల మధ్యారాధన నిర్వహించారు. శనివారం కర్ణాటక రాష్ట్రంలోని అనెగొందిలో శ్రీపద్మనాభ తీర్థుల బృందావనాన్ని నిర్మాల్యం చేసి తులసి అర్చన, పంచామృతాభిషేకం వంటి పూజలు నిర్వహించారు.

అవగాహనే ప్రథమ ఆయుధం

- డీఎస్పీ ఉపేంద్రబాబు, కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ, కమిషనర్

ఎయిడ్స్ నివారణకు అవగాహనే ప్రథమ ఆయుధమని డీఎస్పీ ఉపేంద్ర బాబు, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాల, బాలికల ఉన్నత పాఠశాల, విజయ మహిళా మండలి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఎయిడ్స్ నివారణ అవగాహన ర్యాలీని డీఎస్పీ ఉపేంద్ర బాబు, కమిషనర్ గంగిరెడ్డి పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అనారోగ్య సమస్యల్లో ఎయిడ్స్ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ప్రజలు ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి విషయంలో పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎయిడ్స్ బారిన పడకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ప్రిన్సిపల్ విజయరాణి తెలిపారు. కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారి హరి కుమార్, మహిళా మండలి సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థినులు పట్టణంలో వైఎస్ఆర్ కూడలి నుంచి సోమప్ప కూడలి ఇండోర్ స్టేడియం మీదుగా కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. సిఐ శ్రీనివాసులు విజయ మహిళా మండలి నిర్వాహకులు ఓంకార ఆచారి పాల్గొన్నారు.

సాగు, తాగు నీరందించే వరకు పోరాటాలు

- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



లింగన్న

మండలానికి సాగు, తాగునీరందే వరకు పోరాటం కొనసాగిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ తెలిపారు. శుక్రవారం రాత్రి మండలంలో గణేకల్ గ్రామంలో ఆదోని మండల 8వ మహాసభలు బి.వీరారెడ్డి, ఎం.ఉచ్చీరప్ప అధ్యక్షతన జరిగాయి. ముఖ్య అతిథులుగా గౌస్‌దేశాయ్, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామాంజనేయులు, కె.వెంకటేశులు హాజరయ్యారు. అనంతరం మండల కమిటీని 13 మందితో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా కె.లింగన్న, మండల కార్యదర్శి వర్గసభ్యులుగా రామాంజనేయులు, వీరారెడ్డి, జె.రామాంజనేయులు, ఎం.ఉచ్చీరప్ప, సభ్యులుగా అయ్యన్న, పాండురంగ, బాష, అయ్యన్న, పద్మ, హనుమంతు రెడ్డి, మునిస్వామిని ఎన్నుకున్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు డి.లక్ష్మన్న హాజరయ్యారు.

విజయ మహిళా మండలి సిబ్బందికి

సైబర్ నేరాలపై అవగాహన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు




అవగాహన కల్పిస్తున్న పట్టణ సిఐ శ్రీనివాసులు

పట్టణంలోని విజయ మహిళా మండలి స్వచ్ఛంద సేవా సంస్థ సిబ్బందికి పట్టణ సిఐ శ్రీనివాసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. శనివారం విజయ మహిళా మండలి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఫోన్‌లో ఆధార్ కార్డు ఒటిపిలు, బ్యాంకు ఒటిపిలు ఎవరికీ చెప్పరాదని, అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే వీడియో కాల్స్‌ను ఓపెన్ చేయరాదని తెలిపారు. లోన్ యాప్‌ను కూడా ఉపయోగించరాదని, వాట్సాప్ ఫోన్ నెంబర్ ప్రొఫైల్‌లో పోలీసు సిబ్బంది అంటూ ఏర్పాటు చేసుకుని బెదిరింపులకు పాల్పడితే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. విజయ మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాల చారి, ప్రాజెక్టు మేనేజర్ దేవేంద్ర పాల్గొన్నారు. **మంత్రాలయం** మండలంలోని మాధవరం గ్రామస్తులకు, సచివాలయ ఉద్యోగులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. మాధవరం ఎస్ఐ విజయ్ కుమార్, సచివాలయ సెక్రటరీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగికీ విరమణ సహజం

- టిడిపి నాయకులు రామకృష్ణారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



సన్మానిస్తున్న రామకృష్ణారెడ్డి

ప్రతి ఉద్యోగికీ విరమణ సహజమని టిడిపి నాయకులు ఎస్.రామ కృష్ణారెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు గుండ్రేవుల నిరుపమ ఉద్యోగ విరమణ పొందడంతో ఏర్పాటు చేసిన వేదికపై ఆయన మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్ది గౌరవింపబడతారని తెలిపారు. తమ వద్ద చదువు నేర్చుకున్న విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోలేరని పేర్కొన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు నిరుపమను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. టిడిపి నాయకులు హుస్సేని, విద్యా కమిటీ ఛైర్మన్ ఆలం బాష పాల్గొన్నారు.

ఎల్ఎల్‌సి రైతుల ఆందోళన

- దిగొచ్చిన అధికారులు

ప్రజాశక్తి - కౌతాళం

తుంగభద్ర దిగువ కాలువకు సాగునీటి సరఫరాను కొన్ని రోజుల వరకు నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించడంతో రైతులు ఆందోళనకు దిగారు. ఈనెల 1 నుంచి 10 వరకు ఆంధ్ర సరిహద్దు నుంచి నీటి సరఫరాను నిలిపివేసి తుంగభద్ర దిగువ కాలువకు మరమ్మతు పనులు చేపట్టాలని ఇటీవల జరిగిన ఐఎబి సమావేశంలో అధికారులు తీర్మానించారు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు, మండల రైతులు శనివారం తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. అనంతరం తహశీల్దార్ మల్లికార్జున స్వామికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి మండల నాయకులు ఏకం రెడ్డి మాట్లాడారు. తుంగభద్ర దిగువ కాలువకు సాగునీటి సరఫరాను నిలిపివేస్తే వేల ఎకరాల్లో సాగయిన పంటలు దెబ్బతిని రైతులు ఆర్థికంగా నష్టపోతారని తెలిపారు. ప్రస్తుతం వరి పంట ఒక్కటే రైతుల చేతికి అందిందని, పత్తి, మిరప, వేరుశనగ, కంది తదితర పంటలు కౌతాళం మండలంతో పాటు కోసిగి, పెద్దకడబూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల తదితర మండలాల్లో సాగు చేసినట్లు చెప్పారు. ఈ తరుణంలో ఎల్ఎల్‌సి అధికారులు మరమ్మతుల పేరిట సాగునీటి సరఫరా నిలిపివేస్తే పంటలు ఎండిపోతాయన్నారు. మిరప పంట పూత దశలో ఉందని, ఎకరాకు రూ.50 వేల నుంచి రూ.75 వేల వరకు పెట్టుబడులు పెట్టినట్లు తెలిపారు. అధికారులు మరమ్మతులు చేయించడం మంచిదే కానీ.. ఈ సమయంలో కాకుండా పంటలు పూర్తిగా రైతులకు వచ్చినప్పుడు (అంటే వేసవిలో) పనులు చేపట్టాలని కోరారు. ఉన్నతాధికారులు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని రైతులకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. తహశీల్దార్ మల్లికార్జున స్వామి మాట్లాడుతూ... సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు. ఉప్పరహాల్ గ్రామ రైతులు భీమన్న గౌడ్, రామ గోవిందప్ప, పెద్ద లింగన్న, వెంకటేశ్వర రెడ్డి, హుస్సేని, బదినేహాలు గ్రామ రైతులు కురువ గంగప్ప, కోరి నాగరాజు, ఖాదర్ బాషా, కౌతాళం రైతులు జట్లప్ప, వైసిపి నాయకులు పాల్ దినకరన్, అవతారం, రాముడు, గోపాల్ రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

దిగొచ్చిన ఎల్ఎల్‌సి అధికారులు

తుంగభద్ర దిగువ కాలువ అధికారులు రైతుల ఆందోళనతో దిగివచ్చారు. ఈ విషయంపై ఎల్ఎల్‌సి డిఇ మహ్మద్ సైఫుల్లా మాట్లాడుతూ... రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. రైతుల పంటలు కాపాడాలని మరమ్మతు పనులను వాయిదా వేసి, రైతులకు సాగునీటిని సరఫరా చేసేలా ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు.

నీటి నిలుపుదలను విరమించుకోండి

- నీటి సంఘం మాజీ అధ్యక్షులు తప్పెట రామ్‌రెడ్డి, రైతులు

ప్రజాశక్తి - హోళగుంద

తుంగభద్ర డ్యాం ద్వారా ఎల్ఎల్‌సికి నీటిని నిలుపుదల చేయాలని ఆలోచనను తుంగభద్ర ప్రాజెక్ట్ అధికారులు విరమించుకోవాలని నీటి సంఘం మాజీ అధ్యక్షులు తప్పెట రామ్ రెడ్డి, రైతులు డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడారు. ఈనెల 1 నుంచి 15 వరకు నీటిని నిలుపుదల చేస్తున్నట్లు తమకు సమాచారం అందిందని తెలిపారు. వరి కోత సమయమని, రైతులు ఎవరికీ నీటి అవసరం లేదనే సాకుతో ఆంధ్రకు రావాల్సిన వాటా ఇండెంట్ అడగకుండా నీటిని నిలుపుదల చేస్తే రైతులు ఇబ్బంది పడతారని చెప్పారు. ఎల్ఎల్‌సి చివరి ఆయకట్టు రైతుల మిరప, జొన్న, వేరుశనగ పంటలు దెబ్బతినడమే కాకుండా తాగునీటికి ఇబ్బందిగా మారుతుందని గుర్తు చేశారు. ఆంధ్ర వాటా ఇంకా 15 టిఎంసిల వరకు ఉందని, ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 94 టిఎంసిల నీటి నిల్వ ఉందని తెలిపారు. అలాంటప్పుడు నీటిని యథావిధిగా కొనసాగించడంలో ఇబ్బంది ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. సింధువాలం కృష్ణయ్య, నాగప్ప, వెంకటేష్, మల్లయ్య, నాగరాజు, గోవిందప్ప, శంకరయ్య, తిక్కన్న పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి : ఎస్ఐ

ప్రజాశక్తి - హాలహర్వి

రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని ఎస్ఐ చంద్ర సూచించారు. శనివారం ఆయన మాట్లాడారు. వివిధ పనుల నిమిత్తం బయటికి వెళ్లిన ప్రజలు సురక్షితమైన ప్రయాణం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు హెల్మెట్ లేకపోవడం వల్ల విలువైన ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. కుటుంబాలు అనాథలుగా మిగులుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వినియోగించాలని సూచించారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. నెంబర్ ప్లేట్ లేకుండా కనిపించే వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తామని తెలిపారు. మద్యం మత్తులో డ్రైవింగ్, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా వంటి నిర్లక్ష్యపు డ్రైవింగ్ చేయవద్దని, జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని సూచించారు.



రోడ్డు మలుపులను పరిశీలిస్తున్న అధికారులు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

- ఎంవిఐ శిశిర దీప్తి

ప్రజాశక్తి - గోనెగండ్ల

రోడ్డు ప్రమాదాలను నివారించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆదోని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కె.శిశిర దీప్తి, ఆర్అండ్‌బి కోడుమూరు సెక్షన్ డిఇ రవిచంద్ర, గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్ తెలిపారు. శనివారం ఆయా రోడ్లలో ప్రయాణించి తీసుకోవాల్సిన చర్యల గురించి పర్యవేక్షించారు. కోడుమూరు నుంచి ఎమ్మిగనూరు, కోడుమూరు, పత్తికొండ స్టేట్ హైవేపై ఉన్న ప్రమాదకర ప్రదేశాలు, మలుపులను గుర్తించారు. అక్కడ రోడ్డు ప్రమాదాలు జరగకుండా త్వరలోనే సూచిక బోర్డులను ఏర్పాటు చేయడం, రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదలను తొలగించనున్నట్లు తెలిపారు.

గతంలో గ్రామాల్లో అభివృద్ధి జరిగిందా..?

- ఒక్క చిప్పగిరి మండలంలోనే రూ.2 కోట్లతో అభివృద్ధి పనులు

- టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్

ప్రజాశక్తి - చిప్పగిరి

గత వైసిపి ప్రభుత్వంలో ఏ ఒక్క గ్రామంలోనైనా అభివృద్ధి పనులు జరిగాయా అని టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ఒక చిప్పగిరి మండలంలోనే రూ.2 కోట్లతో అభివృద్ధి పనులను చేపడుతున్నామని చెప్పారు. శనివారం కుందనగుర్తి గ్రామంలో సర్పంచి కొండా పురుషోత్తం ఆధ్వర్యంలో ఉపాధి హామీ నిధులు రూ.20 లక్షలతో చేపడుతున్న సిసి రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి ప్రారంభించారు. అలాగే ఒకరోజు ముందుగానే వీరభద్ర గౌడ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్లను అందజేశారు. అంతకుముందు ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్‌ను మేళతాళాలతో స్వాగతం పలికారు. పూలమాల, శాలువాతో సర్పంచి పురుషోత్తం ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచి ఇంటి వద్ద ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. వేదవతి, నగర్‌డోన రిజర్వాయర్ పనుల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. సరిపడే నిధులు డిసెంబర్ ఆఖరికల్లా మంజూరు చేస్తామని తెలిపారన్నారు. చిప్పగిరికి సంబంధించి హంద్రీనీవా కాలువకు ప్రత్యేక తూము ఏర్పాటుకు త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులు మొదలు పెడతామని తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు త్వరలోనే ఇల్లు కట్టే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. స్థలం ఉన్న వారికి పిఎం ఆవాస్ యోజన కింద నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇంటి నిర్మాణాలకు నిధులు, పింఛన్లు ఇప్పిస్తామని చెప్పే దళారులను దగ్గరకు రానివ్వవద్దని సూచించారు. ఎంపిడిఒ అల్లా బకాష్, పిఎస్ నరసింహులు, తెలుగు యువత జిల్లా మాజీ అధ్యక్షులు మేకల రవి యాదవ్, ఎంపిటిసి రజిని, డేగులపాడు సర్పంచి నీలకంఠ, మాజీ కన్వీనర్ కిష్టప్ప, సీనియర్ నాయకులు తిమ్మయ్య, అంపయ్య, వన్నాల ఆంజనేయులు, కొండా గోవిందు, శ్రీలక్ష్మి, బిల్లోన గోవిందు, శివలింగ, శ్రీనివాసులు, పోతరాజు రాముడు, బోగేష్, జనార్ధన స్వామి, అంజి యాదవ్, ఓబయ్య, రాంబాబు, మేకల రామాంజనేయులు పాల్గొన్నారు.



కుందనగుర్తిలో పింఛన్ల పంపిణీని ప్రారంభిస్తున్న వీరభద్ర గౌడ్

మళ్లీ కుర్చీల వివాదం..!

- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ప్రత్యేక కుర్చీలు ఎందుకు..?
- ఛైర్మన్ పోడియాన్ని ముట్టడించిన వైస్ ఛైర్మన్, వైసిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కార వేదికగా ఉండాల్సిన కౌన్సిల్ వివాదాలకు అడ్డాగా మారింది. నెలకోసారి జరిగే సమావేశం రసాభాసగానే సాగుతోంది. శనివారం ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఛైర్మన్ శాంత అధ్యక్షతన మొదలైంది. సమావేశం ప్రారంభంలోనే కుర్చీల ఏర్పాటుపై వివాదం మరోసారి ముదిరింది. గతంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్‌లకు ప్రత్యేక కుర్చీలు ఉండేవి. మూడు నెలలుగా సాధారణ కౌన్సిలర్ల వరుసలోనే కూర్చోవాలని ఛైర్మన్ శాంత చెప్పడం వల్ల గత కౌన్సిల్‌లోనే వివాదం ముదిరి సమావేశం వాయిదా పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ సమావేశంలో కూడా కుర్చీల ఏర్పాటుపైనే వివాదం ముదిరింది. గత మూడు నెలలుగా కౌన్సిలర్లు, వైస్ ఛైర్మన్లు కుర్చీల కోసం మూడో నెల కౌన్సిల్ సమావేశంలోనూ ఛైర్మన్ బోయ శాంతతో వాగ్వాదానికి దిగారు. పోడియం చుట్టుముట్టి ఛైర్మన్‌కు వ్యతిరేకంగా వైస్ ఛైర్మన్లు నరసింహులు, మహ్మద్ గౌస్, కౌన్సిలర్లు ఇంతియాజ్, రాజేశ్వర్ రెడ్డి, చలపతి, అశోక్, ఫయాజ్ అహ్మద్, లోకేశ్వరి నినాదాలు చేస్తూ అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ప్రత్యేక కుర్చీలు ఎందుకని ప్రశ్నించారు. ఛైర్మన్ పోడియం ముట్టడించి వైస్ ఛైర్మన్, కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. చివరకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల కుర్చీలను తొలగించారు. ప్రత్యేక కుర్చీలు వేసే వరకు కింద కూర్చొని నిరసన చేపడతామని, సమావేశంలో పాల్గొంటామని కౌన్సిలర్లు కింద బైఠాయించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ, మున్సిపల్ ఇంజినీర్ ఇంతియాజ్ సైతం నిలబడి సమావేశంలో పాల్గొన్నారు.



హాలులో కూర్చొని నిరసన తెలుపుతున్న వైసిపి కౌన్సిలర్లు

IN THE COURT OF THE II ADDITIONAL DISTRICT JUDGE KURNOOL AT ADONI

O.S. No. 1/2024

Between :

Katike Bade Bee and 2 others. .... Plaintiffs.

Katike Badesah and 31 others .... Defendants

To.

1) V. Jyothi, D/o V. Rama Swamy, aged about 35 years, Hindu, House-Wife, H. No. 8- 6-76/1/8, Karmangat, HYDERABAD CITY
2) B. Narasamma, W/o B. Nagaraju, aged about 50 years, Hindu, Agriculturist, R/o CHILAKALADONA VIL & Post. Mantralayam Mandal, Kurnool Dist
3) Chaduvula naganna, S/o Sunkanna, aged about 48 years, Hindu, Agriculturist, H. No. 1/68, R/o AYYAVARIPALLE Village, Mandal, Mahaboob Nagar Dist., Telangana State.
4) Kurma Mallikarjuna, 5/o Korma Mallesh, Hindu, Major, 25-17-106/3, Srinivasarao Thota, 60 Feet Road, 11th Lane, GUNTUR.
5) Mutalanna Eswaraiah, 5/o Mallaiah, Hindu, Major, Srinivasarao Thota, GUNTUR, Guntur Dist.
6) Kurma Veeresh, 5/0 Kurma Mallesh, Hindu, Major, Hut No. 108, A.P. Foods, IDA NACHARAM, UPPAL, Ranga Reddy, TS
7) Kammari Mallikarjuna, S/o K.Lakshmaiah, Hindu, Major, R/o Gajuladinne BC Colony, IRANBANDA VIL, Gonegandla Mandal, Kurnool Dist.
8) Vadla Jareena Banu, W/o V. Allavuddin, Muslim, Major, R/o Muslim Veedhi, Poolachinta Road, NANDAVARAM Vil. & Mandal.
9) Mangali Bhaskar, 5/o Not known, Hindu, Major, R/o H.No. 1-118, MANTRALAYAM VII. & Mandal, Kurnool Dt.
10) Peta Seema Begum, W/o Nazeer, Muslim, Major, R/o H. No. 8/484, Mugatipeta, YEMMIGANUR, Kurnool Dist.
11) Hakeem Abu Avow Aab, S/o Hakeem Abdul Tawaab, Muslim Major, R/o 1-1- 4/8, Hydernagar Masjid Lane, KUKATPALLY, HYDERABAD,
12) Muthalanna Gopiraju, 5/o M. Eswaraiah, Hindu, Major, R/o H.No. 25- 17-233, Sreenivasa Rao Thota, GUNTUR. Guntur Dist.

Sirs,

The above named Plaintiffs have filed the above suit for partition and separate possession of 1/9th share of each Plaintiff in respect of the land bearing Sy. No. 173 (Full) measuring Ac. 2.43 Cents situated within the limits of Kalugotla Village, which is situated within the Registration District of Kurnool and Sub-Registration District of Yemmiganur. The above suit stands posted to 09-12-2024 for your appearance. Please take notice that if all of you fail to appear either in-person or through an Advocate before the above said Court on 09-12-2024 at 10.30 a.m. sharp and state your objections, if any. If you fail to do so the matter will be heard and decided by setting all of you Ex-parte.

Y. RAMI REDDY, B.Sc., B.L.,
Advocate, ADONI.
Cell No.: 9440554493.

అంత్యక్రియలకు వెళ్తూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోనెగండ్ల



బంధువు అంత్యక్రియల నిమిత్తం భార్యతో కలిసి బయల్దేరిన వ్యక్తి మార్గమధ్యంలో తలెత్తిన అనారోగ్య కారణంతో సంభవించిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు... కోడుమూరు మండలం ప్యాలకుర్తి గ్రామానికి చెందిన షేక్ యూసుఫ్ (55) బంధువు అంత్యక్రియల నిమిత్తం భార్య జరీనా బేగంతో కలిసి తన స్కూటీపై ప్యాలకుర్తి గ్రామం నుంచి ఎమ్మిగనూరుకు శనివారం ఉదయం బయల్దేరారు. వెముగోడు గ్రామ సమీపంలోని కొత్త పెట్రోల్ బంకు సమీపంలోకి చేరుకునే సరికి యూసుఫ్‌కు బీపీ డౌన్ అయింది. స్కూటీ అదుపుతప్పి కింద పడగా దెబ్బ తగిలి రక్తం పోవడంతో అక్కడికక్కడే మృతి చెందారు.

కారు, ద్విచక్ర వాహనం ఢీకొని


యువకుడు మృతి

ప్రజాశక్తి - నందవరం

కారు, ద్విచక్ర వాహనం ఢీకొనడంతో యువకుడు మృతి చెందారు. శనివారం మండలంలోని ముగతి గ్రామ సమీపంలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఎమ్మిగనూరు వైపు నుంచి వెళ్తున్న (ఏపి 04 బిటి 5040) ద్విచక్ర వాహనాన్ని మంత్రాలయం వైపు నుంచి ఎమ్మిగనూరు వైపు వస్తున్న ఇన్నోవా (కెఎ 05 ఎం ఎఎ 0419) కారు ఢీకొట్టింది. మంత్రాలయం మండలం సుంకేసుల గ్రామానికి చెందిన బలిజ పెద్ద రంగస్వామికి తీవ్ర గాయాలయ్యాయి. ఎమ్మిగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షలు చేసి మృతి చెందినట్లు తెలిపారు. నందవరం ఎస్ఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆలూరు



చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతి చెందారు. మండలంలోని హత్తి బెళగల్ గ్రామానికి చెందిన సద్దాం హుస్సేన్(35) గత నాలుగు రోజుల క్రితం ఆలూరు, హత్తిబెళగల్ రోడ్డు మార్గంలో బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి పడ్డారు. కోమాలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందారు. ఆలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమానికి మారు పేరు బాబు...

- టిడిపి ఇన్‌ఛార్జీ రాఘవేంద్ర రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం


సంక్షేమానికి మారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని, నెలలో రెండు ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేసిన ఘనత ఆయనదే అని టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బి.లక్ష్మన్న, బిజెపి ఇన్‌ఛార్జీ విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిధులతో నియోజకవర్గంలో సాగు, తాగునీరు, రోడ్లు వంటి అభివృద్ధి పనులపై ప్రత్యేక చొరవ తీసుకున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి లోటు లేకుండా చూస్తున్నామని పేర్కొన్నారు. మాజీ జడ్‌పిటిసి ఆర్.లక్ష్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేష్, పోలి శివ, వీరేష్, బంద్రాళ్ల నరసింహులు, హుస్సేని, హనుమంతు, ఈరన్న, బాలరాజు, జనసేన ఏసేబు, చిదానంద, నాగన్న, చాకలి శివ, వెంకటరాముడు పాల్గొన్నారు. అలాగే స్థానిక రామచంద్ర నగర్ కాలనీలో టిడిపి పట్టణ ఇన్‌ఛార్జీ వరదరాజులు, ఎంపిటిసి నక్కి వెంకటేష్‌లు సచివాలయ ఉద్యోగి రమేష్‌తో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు మేకల నరసింహ పాల్గొన్నారు. **ఆలూరు** పట్టణంలో ఉరుకుంద ఈరన్న కొట్టాల, మెయిన్ బజార్ తదితర కాలనీల్లో టిడిపి మహిళా నాయకులు వైకుంఠం జ్యోతి అధికారులతో కలిసి పింఛను అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో పింఛను అందించాలంటే వాలంటీర్లు కావాలని.. వారు లేకుంటే పింఛను అందించలేమని అనుకున్నా వైసిపి నాయకులకు దిమ్మ తిరిగేలా గత ఐదు నెలలుగా పింఛను అందిస్తున్నారని తెలిపారు. సర్పంచి అరుణాదేవి, టిడిపి జిల్లా నాయకులు బెంగళూర్ కిషోర్, రహమాన్, గోవిందు, నాగరాజు, ఆనంద్, లింగన్న పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని కారుమంచి గ్రామంలో పింఛను పంపిణీలో టిడిపి ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ముఖ్య అతిథులుగా పాల్గొని పింఛను పంపిణీ చేశారు. ముందుగా వీరభద్ర గౌడ్‌కు నాయకులు శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. ఎంపిడిఒ గీతావాణి, సర్పంచి లక్ష్మి, మండల కన్వీనర్ పరమరెడ్డి, కార్యదర్శి శేషాద్రి నాయుడు, సాగునీటి సంఘం మాజీ ఛైర్మన్ మల్లికార్జున్ రెడ్డి, మాజీ ఎంపిటిసి శివకుమార్, నాయకులు రవి రెడ్డి, సతీష్, రాజ్‌కుమార్, హనుమంతు రెడ్డి, మల్లికార్జున రెడ్డి, దర్గయ్య, పంచాయతీ కార్యదర్శి కృష్ణ, విఆర్ఒ ఎర్రిస్వామి పాల్గొన్నారు.



మంత్రాలయంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న రాఘవేంద్ర రెడ్డి



ఆలూరులో పింఛను అందిస్తున్న వైకుంఠం జ్యోతి



ఆస్పరిలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వీరభద్ర గౌడ్

పింఛన్లతో ఎంతో చేయూత

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు : వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు సామాజిక పింఛన్లు ఎంతో చేయూతను, భద్రతను కల్పిస్తున్నాయని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు. పట్టణంలోని గీతా నగర్ ప్రాంతంలో పింఛను పంపిణీలో పాల్గొన్నారు. ఆ ప్రాంతంలో నీటి సరఫరాను పరిశీలించారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ సుబ్బరాజు

అపార్ నమోదు వేగవంతం

- ఎంపిడిఒ సుబ్బరాజు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని వివిధ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అపార్ ఐడి నమోదును వేగవంతం చేయాలని ఎంపిడిఒ సుబ్బరాజు కోరారు. శనివారం స్థానిక ఎంఆర్‌సి భవనంలో సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు సమీక్ష నిర్వహించారు. ఎంఇఒలు-1, 2 అంజనేయులు, శోభారాణి, కార్యాలయపు పరిపాలన అధికారి సత్యన్న, విస్తరణ అధికారి యోగేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు సుధాకర్, లక్ష్మీ నారాయణ, హుస్సేన్ బాష, శివ పాల్గొన్నారు.

'రాజ్యాంగ లక్ష్యాలు-దాని ప్రాముఖ్యత'పై

నేడు సెమినార్

- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

భారత రాజ్యాంగ లక్ష్యాలు - దాని ప్రాముఖ్యత అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్లు కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని శివసర్కిల్‌లో గల కెవిపిఎస్ జిల్లా ఉప కార్యాలయంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు సెమినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సెమినార్‌లో సిపిఎం మండల కార్యదర్శి గోవిందు, సిపిఐ మండల కార్యదర్శి రంగన్న, కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ ఖాసీంవలీ, సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కార్యదర్శి రాజు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు నాగమణి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు దేవేంద్ర బాబు, ఎంపిజె రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్ఎండి.ఖాదీర్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవ సహాయం హాజరవుతారని చెప్పారు. కెవిపిఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఎస్.తిమ్మన్న అధ్యక్షత వహిస్తారని తెలిపారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

- మాన్వి దేవేంద్రప్ప

ప్రజాశక్తి - ఆదోని


ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో అర్హులైన కురువలు లబ్ధి పొందేలా చూడాలని కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప సూచించారు. శనివారం ఆదోనిలో సచివాలయ ఉద్యోగులు మాన్వి దేవేంద్రప్పను కలిసి పూలమాలలతో సన్మానించారు. ఆయన మాట్లాడారు. బీసీ కార్పొరేషన్‌కు బడ్జెట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు భారీగానే నిధులు కేటాయించారని తెలిపారు. అందులో కురువలకు పెద్దపీట వేశారని చెప్పారు.



దేవేంద్రప్పను కలిసి సచివాలయ ఉద్యోగులు

నిత్యావసర సరుకులు పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు

- తహశీల్దార్ మల్లికార్జున స్వామి



మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి - కౌతాళం

నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని తహశీల్దార్ మల్లికార్జున స్వామి, డిప్యూటీ తహశీల్దార్ రజనీకాంత్ హెచ్చరించారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న నిత్యావసర సరుకులు ప్రజలకు సకాలంలో అందించాలన్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు ఉంటాయని తెలిపారు.

కప్పట్రాళ్ల, కరివేములలో ఉచిత ఎక్స్‌రే పరీక్షలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని కప్పట్రాళ్ల, కరివేముల గ్రామాల్లో శనివారం టిబి వ్యాధి నివారణలో భాగంగా మొబైల్ ఎక్స్ రే క్యాంపు నిర్వహించారు. 102 మందికి ఉచిత ఎక్స్ రే పరీక్షలు నిర్వహించారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ... క్షయ అంటువ్యాధి అని తెలిపారు. మొబైల్ వాహనం రేడియో గ్రాఫర్స్ శ్రీనివాసులు, ఎల్లయ్య, జిల్లా టిబి ప్రోగ్రామ్ మేనేజర్ ఉమాపతి, తెర్నేకల్ పిహెచ్‌సి హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ రంగస్వామి, టిబి సూపర్‌వైజర్ వీరన్న, జీవిత, మమత, ఎంఎల్‌హెచ్‌పి వినీత, ఆరోగ్య కార్యకర్త హేమలత పాల్గొన్నారు.

'సుందర్ రాజు మృతి తీరనిలోటు'

ప్రజాశక్తి - నందవరం

నందవరం గ్రామానికి చెందిన దళిత సుందర్ రాజు మృతి తీరని లోటని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య తెలిపారు. సుందర్ రాజు (60) కొద్దిరోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. శనివారం జైభీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జడ రవి, మండల ప్రధాన కార్యదర్శి శావల శాంతి రాజు సుందర్ రాజు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. జైభీమ్ ఎంఆర్‌పిఎస్ జిల్లా కన్వీనర్ గంధాలం మణికుమార్, శావల బుజ్జిబాబు, జైభీమ్ ప్రధాన కార్యదర్శి శావల సత్యానందం, మాదిగ, నందవరం మండల ఇన్‌ఛార్జీ చింపిరి చిన్న పోతప్ప, మండల గౌరవాధ్యక్షులు చింపిరి పెద్ద పోతప్ప, మండల కన్వీనర్ పరంపోగు సురేష్, ఎంఆర్‌పిఎస్ మండల నాయకులు భాస్కర్ పాల్గొన్నారు.

మహారాజశ్రీ కర్నూలు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

ఓ.యస్. నెం.53/2023

1.కె. లీలా కిషోర్ కుమార్
2.కె.శుభిక్ష (మైనర్స్)
రెప్. బై.వీరి తరపు బంధువు
కె. సుబ్రహ్మణ్యం

... వాదులు

-ఎదురి -

కె. రవి రాజు మరియు ఇతరులు ... ప్రతివాదులు

1,2,3 ప్రతివాదులకు దావా సమన్లు

1. కె. రవిరాజు తండ్రి కె. గిడ్డయ్య,వ్యాపారం, ఇంటి. నెం. 80-11-76,కృష్ణనగర్,కర్నూలు సిటీ.
2. సూర్య సాయి సతీష్ తండ్రి లింగమూర్తిగౌడ్, వ్యాపారం, ప్లాట్ నెం. 422,రోడ్. నెం. 822, ఉమర్ నగర్, సంతోష్ నగర్, కర్నూలు సిటీ.
3. వి. వరలక్ష్మమ్మ భర్త శివుడు, గృహిణి, ఇంటి. నెం. 76-97-472,జి. ఎఫ్. ఎన్టీఆర్. కాలనీ బోర్డు రోడ్, కల్లూరు, కర్నూలు.

పై నెంబర్ దావాలో వాదులు 1,2 మైనర్ అయినందున వీరి తరపున మూడవ వాది అయిన కె.సుబ్రహ్మణ్యం 1,2,వాదుల తల్లి మరణించినందున ఆమెకు ప్రభుత్వం వారు ఇచ్చిన ప్లాటులో మూడు కొట్టములు నిర్మించినది,ఈ స్థలాన్ని మొదటి ప్రతివాది, రెండో ప్రతివాదికి అమ్మగా రెండో ప్రతివాది మూడవ ప్రతి వాది కి అమ్మి వేసినాడు.ఈ రెండు అగ్రిమెంట్లు చెల్లవని ఎందుకు అనగా ప్రభుత్వ ప్లాట్ ను ఎవరికైనా అమ్మే హక్కు కానీ కొనే హక్కు కానీ ఉండదు. కావున మొదటి ప్రతివాదికి ఈ ప్లాటును అమ్మే హక్కు లేదని ఈ రెండు అగ్రిమెంట్లను రద్దు చేయాలని 1,2 వాదులు మైనర్లు అయినందున మూడవ వాది వీరి తరపున పై కోర్టులో దావా దాఖలు చేసినాడు. ఇందులో 1,2,3 ప్రతివాదులైన మీకు ఏమైనా ఆక్షేపణ ఉన్న యెడల 19-12-2024వ తేదీ పగలు 10:30 గంటలకు పైకోర్టులో హాజరై తెలుసుకొనవలెను. లేని యెడల సదరు దావా మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.

SCHEDULE:

The three huts, bearing Municipal Door. No. 76/97/235/5, built in plot No.244. (R.C.A. No.540/2006, dt.23.06.2006, Situates in Weaker section Colony, laidplots as per approved L.P.No. 389/84, In Sy. No.344 of Kalluru village limits.within Kalluru village Panchayath, in Kurnool Municipal Corporation limits, inKalluru sub-division, Kurnool division, to an extent of (25 X 40) 111.11 Sqr.Yards, and these three huts are commonly bounded by: East : plot No. 245. West : Plot No. 243. North : Rastha.South : Plot No. 269. Measurements of the three huts with total extent of 111.11 Sqrs.Yards

"కోర్టు వారి ఉత్తర్వుల మేరకు"

వాయిదా:19-12-2024

ఎస్. ఎం. కృష్ణమోహన్,
సి. వెంకట అరుణ,
వాదుల తరపు అడ్వకేట్లు,
కర్నూలు.